క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు పాటించాలి



దెందులూరులో పెసర పంట

దెందులూరు: మండలంలో 17 పంచాయతీల్లోని శివారు ప్రాంతాల్లో పెసర పంట సాగవుతోంది. దాదాపు 1,832 ఎకరాల్లో పెసర పంటను రైతులు సాగు చేస్తున్నారు. మంగళవారం దెందులూరు, సత్యనారాయణపురం, కొమరేపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ పెసర సాగవుతున్న పొలాలను పరిశీలించారు. రైతులను కలిసి సాగుకు సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సాగు సంతృప్తికరంగా ఉందని, రైతులంతా సస్యరక్షణ చర్యలు పాటించాలని ఆయన సూచించారు.

రక్షిత నీరు వృథా



దెందులూరు బస్టాండ్ సెంటరులో ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద వృథాగా పోతున్న నీరు

దెందులూరు: దెందులూరు బస్టాండ్ సెంటరులో రక్షిత మంచినీటి పథకంలో శుద్ధి చేసిన నీరు పైపుల నుంచి ప్రతి రోజూ వృథాగా పోతోంది. ఒక వైపు గ్రామంలో రెండు పూటలా తాగునీటి సరఫరా చేసే పరిస్థితి లేదు. గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు చేస్తున్న ఫిల్టర్ నీరు పైపు ద్వారా వృథాగా పోతున్నప్పటికీ సంబంధిత శాఖాధికారులు మౌనం వహించడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వృథాను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగిపై దాడి

దెందులూరు: విధి నిర్వహణలో ఉన్న లైన్‌మేన్‌పై దాడి జరిగిన వైనమిది. ఈ ఘటనకు సంబంధించి విద్యుత్ శాఖ దెందులూరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దోసపాడు గ్రామ విద్యుత్ లైన్‌మేన్ బొల్లే సుధాకర్ విధి నిర్వహణలో భాగంగా గ్రామంలోని కడిమే సాయి ఇంటికి విద్యుత్ బిల్లు కోసం వెళ్లాడు. సాయిని కలిసి రెండు నెలల నుంచి విద్యుత్ బిల్లు బకాయి చెల్లించాలని సుధాకర్ కోరాడు. బిల్లు చెల్లించకపోవడంతో నిబంధనల మేరకు విద్యుత్ ఫ్యూజును తీసుకుని లైన్‌మేన్ ఇంటికి వచ్చేశాడు. సాయి లైన్‌మేన్ ఇంటికి వచ్చి దాడి చేసి కొట్టాడు. లైన్‌మేన్‌ను స్థానికులు, సహచర లైన్‌మేన్లు దెందులూరు మండల ఏఈ రమేష్ ఏలూరు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. విధి నిర్వహణలో దోసపాడు లైన్‌మేన్‌పై గ్రామానికి చెందిన సాయి దాడి చేసి కొట్టడంపై మంగళవారం రాత్రి దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఐ. వీర్రాజుకు విద్యుత్ ఏఈ రమేష్ ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

గణనాథునికి రజిత ఆభరణం సమర్పణ



బయ్యన్నగూడెంలో గణనాథునికి వెండి ఆభరణం అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : జంగారెడ్డిగూడెం గ్రామంలోని స్వయంభు శ్రీ పంచముఖ శ్వేతార్క హేరంభ గణపతికి రజిత ఆభరణం సమకూరింది. బయ్యనగూడెం గ్రామానికి చెందిన కందుకూరి ఉదయ భాస్కర రాజు, విజయ కుమారి దంపతులు మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి ఆనందశివాచార్యులకు ఈ ఆభరణాన్ని అందజేశారు. గణనాథుని వక్రతుండానికి సరిపడా సుమారు రూ.40 వేల విలువైన అరకేజీ వెండిని ఆభరణంగా తయారు చేసి అర్చకులకు అందజేశారు. స్వామివారికి వక్రతుండ ఆభరణాన్ని శాశ్వత అలంకారంగా ఉంచి నిత్య పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

నేటి నుంచి రహదారి భద్రతా వారోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో రహదారి భద్రతా వారోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమీషనర్ ఎం. పురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలను ఈ నెల 24వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లాలో ఉన్న బ్లాక్ స్పాట్‌లను పరిశీలించి 15 శాతం వరకూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు చేపడతామని, వీటితో పాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాహన చోదకులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

ఆపదలో అపరాల రైతులు

- పట్టిపీడిస్తున్న తెగుళ్లు
- పెట్టుబడి రెట్టింపు



తెగుళ్లు సోకిన అపరాల పంట



అపరాల సాగుపై పురుగు మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

పెదవేగి: అపరాల సాగు చేయాలని, రైతులకు ఆదాయం బాగుంటుందని వ్యవసాయశాఖాధికారులు ప్రోత్సహిస్తున్నారు. వాస్తవ పరిస్థితిలో అపరాలు సాగు చేసే రైతుల పరిస్థితి మాత్రం దయనీయంగా మారింది. ఆదాయం సంగతి అలా ఉంచితే పెట్టుబడి రాని దుస్థితి నెలకొనడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మినుము, పెసర పంటలకు వైరస్ తెగుళ్లు సోకి తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టాలో రూ.25 వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. మొత్తం ఈ ఆయకట్టు భూమి దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాల పరిధిలోనే ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వ్యాపించిన తెగుళ్లను అరికట్టేందుకు పురుగు మందుల వినియోగానికి అధిక పెట్టుబడి అవసరమైందని రైతులు అంటున్నారు. దీనిపై వ్యవసాయశాఖ సిబ్బంది చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు గ్రామాల్లో అవగాహన కల్పించాలని కౌలు రైతు నాయకుడు శ్రీనివాస్ అన్నారు. తెగుళ్లు వ్యాపించడంతో ఎకరానికి క్వింటా, కింటాన్నర దిగుబడి రావడం కష్టతరమవుతోందని, పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఎకరా పొలంలో అపరాల సాగుకు 20 కేజీల విత్తనాలు అవసరమవుతాయి. దీనికి ఖర్చు రూ.2,500 నుంచి రూ.3,000 అవుతుంది. సాధారణ పరిస్థితుల్లో ఎకరా పంట రక్షణకు 3 నుంచి 4 సార్లు తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తారు. తెగుళ్లు అధికంగా వ్యాపిస్తే 5 నుంచి 6 సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తుంది. దీనికి రూ.10,000 నుంచి రూ.15,000 పెట్టుబడి అవసరమవుతుంది. సాధారణంగా ఎకరా పొలంలో అపరాల సాగు ద్వారా 5 నుంచి 6 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం తెగుళ్లు వ్యాపించడంతో 3 నుంచి 4 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పెసలు ధర క్వింటాల్ రూ.7,750, మినుము క్వింటాల్ ధర రూ.6,600. అపరాల దిగుబడి పెరగకుంటే నష్టాలు తప్పవని రైతులు అంటున్నారు.

దిగుబడి లేకపోవడంతో తెగుళ్లు వ్యాపించిన పంటను గొర్రెలు మేయడానికి ఇచ్చేసుకునే దయనీయ పరిస్థితిలో నేడు అపరాల సాగు ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో సన్న, చిన్న కారు రైతులు, కౌలురైతులు మినుము, పెసర పంటలపై ఆశలు పెట్టుకుని సాగు చేశారు. పూత దశలో తెగుళ్లు వ్యాపించి పంట నాశనమైంది. పురుగు మందులను పిచికారీ చేసినా తెగుళ్లు నివారణ కాలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికార్లు స్పందించి, తగిన సూచనలు ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు అంటున్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి



అపరాల రైతులకు వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా తెగుళ్లు పంటలను పట్టి పీడిస్తున్నాయి.

– కె శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి

19 నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ శిబిరం

భీమడోలు: మండలంలోని ఆధార్ నమోదు, ఆధార్‌లో వివరాల మార్పులు, చేర్పుల కోసం గుండుగొలను, పూళ్ల సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు మొబైల్ ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్ మంగళవారం తెలిపారు. గ్రామాల్లోని విద్యార్థులు, గ్రామ ప్రజలు ఎక్కువ మందికి అవగాహన కల్పించి ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈనెల 19న గుండుగొలను శ్రీవిద్యాలయ స్కూలు, పూళ్ల గ్రామ పంచాయతీ వద్ద, 20న గుండుగొలను శ్రీవిద్యాలయ స్కూలు, పూళ్ల -1 సచివాలయం, 21న గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల, పూళ్ల -2 సచివాలయం వద్ద, 23, 24వ తేదీల్లో గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల, పూళ్ల సచివాలయం -3లో ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

దెందులూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దెందులూరు మండలంలోని గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి దాతలు మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు రూ. 10.50 లక్షలు ఆలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. మంగళవారం ఆలయంలో దాత గంటా కోటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి ఆలయం పక్కన నిర్మించిన షెడ్డులో టైల్స్ ఏర్పాటు, నాలుగువైపులా ప్రహరీ నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు తాము రూ.10.50 లక్షలు విరాళంగా అందించామన్నారు. గాలాయగూడెంతో పాటు సమీప గ్రామాల్లో ఎవరైనా వివాహ వేడుకలు నిర్వహించుకునేందుకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా



ఏలూరులోని బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్స్‌తో సమానంగా 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం బీఎస్ఎన్ఎల్ /ఎంటీఎన్ఎల్ పెన్షనర్స్‌కి పెన్షన్ పెంపుదల చేయాలని కోరుతూ ఆల్ ఇండియా బియస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద మంగళవారం పెన్షనర్స్ ధర్నా నిర్వహించారు. జనవరి1,2017 నుంచి పెన్షన్స్ పెంపుదల చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని భీమవరం, భీమడోలు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, నిడదవోలు, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం బ్రాంచ్‌ల నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎస్‌వి రామారావు, కేంద్ర కమిటీ సభ్యులు పి.పుల్లారావు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, బ్రాంచ్ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సీఎస్ఐ పాఠశాలలో కలుసుకున్న ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఎస్ఐ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ పాఠశాలలో 1986 నుంచి 1998 సంవత్సరం వరకూ చదువుకున్న విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడినా నాటి మిత్రులను కలుసుకోవాలనే ఆరాటం వారిలో కనిపించింది. దాదాపు 25 సంవత్సరాల అనంతరం కలుసుకున్న పాత మిత్రులంతా ఆనాటి జ్ఞాపకాలను నెమర వేసుకుంటూ తమ కుటుంబం, పిల్లల వివరాలు వారి చదువులు, ప్రస్తుత వారి ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను తెలుసుకొని రోజంతా ఉత్సాహంగా గడిపాడు. ఈ సందర్భంగా అప్పటి తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వపు ప్రధానోపాధ్యాయురాలు బీఆర్ శాంతకుమారి మాట్లాడుతూ 25 సంవత్సరాలు గడిచినప్పటికీ అప్పటి తమ విద్యార్థుల స్నేహం ఇప్పటికీ కొనసాగించడాన్ని అభినందించారు. పాత మిత్రులంతా ఎప్పటికీ ఇలానే కలిసిమెలిసి ఉండాలని, ఒకరికి ఒకరు సహకరించుకుంటూ మిత్రుల ఎదుగుదలకు అండగా నిలవాలని ఆమె సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ బ్యాంక్ అధికారులకు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం బ్యాంక్ అధికారులు, ఫీల్డ్ ఆఫీసర్లతో ఆయన ఫిబ్రవరి 11 న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి కృషి చేయాలన్నారు. రాజీపడదగ్గ కేసులను రాజీ చేయించి కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించే బాధ్యత బ్యాంక్ అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా బ్యాంక్ రుణ బకాయి కేసులు, ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు ప్రతి రోజు ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ ద్వారా రాజీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాలుగు మండలాల బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ అధికారులు పాల్గొన్నారు.

27 కేసుల నమోదు

దెందులూరు: మండలం పరిధిలో 17 పంచాయతీల్లో 27 కేసులు నమోదు చేసినట్టు దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు మంగళవారం తెలిపారు. 162 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. 42 మందిపై 27 కేసులు నమోదు చేశామన్నారు. 125 మందిని బైండోవర్ చేశామన్నారు. మంగళవారం మండలంలో కోడిపందేలు, పేకాట స్థావరాలను తనిఖీ చేసినట్టు ఆయన తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు





కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు →

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంటకేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి, నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం డీ. నవీన్ కుమార్ సుందర కాండ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో గరికపాటి కాళిదాసు బృందం కవి సమ్మేళనం నిర్వహించి పలు కవితా గానాలు చేశారు. రాత్రి 7 గంటల నుంచి నగరానికి చెందిన కిళాంబి పూర్ణశ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి 8 గంటలకు నగరానికే చెందిన వైవీపీఎస్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంద్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

రోడ్డు మార్జిన్ల ఆక్రమణ

పట్టించుకోని అధికారులు



లింగగూడెం - చింతంపల్లి రహదారిపై మార్జిన్లు ఆక్రమణకు గురైన దృశ్యం

చింతలపూడి : చింతలపూడి మండలంలో ప్రధాన రహదారుల రోడ్డు మార్జిన్లు రోజురోజుకూ కుచించుకుపోతున్నాయి. రోడ్డు మార్జిన్లలో ఉన్న స్థల యజమానులు మార్జిన్లను కూడా వదలకుండా మింగేస్తున్నారు. అధికారులు ప్రతి రోజూ ఈ రహదారుల్లో ప్రయాణాలు చేస్తున్న మార్జిన్ల ఆక్రమణలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. చింతలపూడి - ఏలూరు, చింతలపూడి - మేడిశెట్టివారి పాలెం, చింతలపూడి - గురుభట్లగూడెం, చింతలపూడి - టి నరసాపురం ప్రధాన రహదారులు ఇప్పటికే ఆక్రమణకు గురయ్యాయి. ఇవి కాక పంచాయతీ రాజ్ రహదారులు సైతం ఇదే విధంగా మార్జిన్లను ఆక్రమించుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ఏకంగా ఫెన్సింగ్‌లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్డు మార్జిన్లను ఆక్రమించడం కారణంగా వర్షపు నీరు ప్రవహించే మార్గం లేక రోడ్లు కోతకు గురై కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులు ధ్వంసం అవుతున్నాయి. అదే విధంగా రోడ్డు ప్రమాదాలకు మార్జిన్లను ఆక్రమణే కారణమన్న విషయం తెలిసిందే. ఇక పట్టణంలో అయితే రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారుల నుంచి సంబంధిత గృహ యజమానులు అద్దెలు వసూలు చేస్తున్న విషయం అధికారుల దృష్టికి రావడంతో ఇటీవల నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు పట్టణంలో చిరు వ్యాపారులు నగర పంచాయతీకి తగిన రుసుం చెల్లించి వ్యాపారాలు చేసుకోవచ్చునని తెలిపారు. ఇదిలా ఉండగా రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి మండలంలో ఆక్రమణకు గురైన రోడ్డు మార్జిన్లను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల : తిరుమలంపాలెంలో కోడి పందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఒక కోడి పుంజును, రెండు కోడి కత్తులను, రూ.1,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

గణాచార్యులకు జలాభిషేకం



కాన్వ విద్యాపీఠంలో గణాచార్యులకు జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగ సందర్భంగా ముక్కనుమ రోజున గరగలను ఎత్తుకున్న గణాచార్యులకు మంగళవారం జలాభిషేకం చేశారు. కాన్వ విద్యాపీఠంలో బ్రహ్మశ్రీ అనిపెద్ది నరసింహ శర్మ దంపతులు గణాచార్యులకి జలాభిషేకం నిర్వహించారు. గరగదారులైన వారిని దేవతామూర్తులుగా భావించాలి అని, గరగలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం వల్ల ప్రజలు పాడిపంటలతో వర్ధిల్లుతారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి అమ్మవార్ల ప్రతిరూపాలైన గరగలను ఎత్తుకుని గణాచార్యులు పూజలు అందుకున్నారు.

ముగిసిన చింతాలమ్మ ఉత్సవాలు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఐదు రోజులపాటు రైతు సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చివరి రోజున చిన్నారులకు సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో డాన్స్ బేబీ డాన్స్ నిర్వహించారు. గంగిరెడ్ల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం సోదరి రామలక్ష్మీ రూ.6వేల విలువైన బహుమతులను విజేతలకు అందజేశారు.

చానమిల్లిలో నేడు గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం చానమిల్లి గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందిన ఆర్థిక లబ్ధి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాత సుందరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఉద్యోగి వెంకటేష్

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. భీమవరానికి చెందిన ఎం.సుందరరావు అమ్మా సిల్క్స్ పేరున ఈ మొత్తాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. కార్యాలయ గుమస్తా వెంకటేష్ దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. దాత వెంట మావూరి రాజా, మావూరి ప్రసాద్, పాపోలు ఏడుకొండలు తదితరులున్నారు.

శబరిగిరీశునికి శఠగోపం సమర్పణ



అయ్యప్పస్వామి ఆలయంలో శఠగోపం సమర్పిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం : శబరిగిరీశునికి భక్తులు మంగళవారం శఠగోపం సమర్పించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కన్నాపురం రోడ్డులోని అయ్యప్ప స్వామి మందిరంలో గ్రామవాసి సంకు మహాగణేష్, వెంకట సూర్య కళా దంపతులు, రోషన్ నీవిష వెంకన్న, కళావతి దంపతులు అయ్యప్ప స్వామి వారికి రూ.14 వేల విలువైన వెండితో శఠగోపం తయారు చేయించి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గునుపూడి శేషాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

పెదవేగి : కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేయగా, ఘటనా ప్రదేశంలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,840 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మండలంలోని పేరంపేటకు చెందిన గుత్తుల రామలక్ష్మి తన మూడేళ్ల కొడుకుతో సహా మంగళవారం రాత్రి అదృశ్యమైనట్లు ఎస్సై ఎన్.సాగర్‌బాబు తెలిపారు. ఈమేరకు ఆమె తల్లి నాగ సుజాత ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రజా రక్షణలో పోలీసులే కీలకం

పెనుగొండ: సమాజంలో ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, వారిని గౌరవించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని నగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ నూలి తాతాజీ అన్నారు. దివంగత నూలి శ్రీవాస్తవ్ జ్ఞాపకార్థం తండ్రి నూలి వెంకట సత్య కోటేశ్వర గుప్త (తాతాజీ) పెనుగొండ పోలీసులకు యూనిఫాంలు మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మేడపాటి చిరంజీవిరెడ్డి, పిల్లి సత్తిరాజు, లక్ష్మీ లాలిత్య పాల్గొన్నారు.